సాక్షి
నంద్యాల

బుధవారం । 3 । మే । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శన గల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలు వీర భద్ర స్వామికి మంగళవారం పూజలు చేపట్టారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జునరావు మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



కిడ్నాప్ కేసు సుఖాంతం

ఎట్టకేలకు బాలుడి కిడ్నాప్ కేసును రైల్వే పోలీసులు ఛేదించారు. చాకచక్యంగా నిందితులను అరెస్టు చేసి బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రుల ఒడికి చేర్చారు.

8లో

న్యూస్‌రీల్

చెరువుకు జలకళ



వర్షపు నీరు చేరిన వద్దుగండ్ల చెరువు

పాణ్యం: అకాల వర్షాలతో మండు వేసవిలో చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. గత మూడు రోజులుగా నంద్యాల జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం కనిపిస్తోంది. పాణ్యం పరిధిలోని వద్దుగండ్ల చెరువుకు భారీగా వరద నీరు చేరింది. చెరువులో నీటి మట్టం తగ్గి చేపలు పట్టేందుకు మత్స్యకారులు ఏర్పాట్లు చేస్తుండగా భారీ వర్షానికి నీరు చేరడంతో చేపల వేట నిలిచిపోయింది. కొణిదేడు–పాణ్యం మధ్య వొద్దెలవాగు, తమ్మరాజు పల్లె గ్రామం వద్ద ఉన్న అడ్డాగులో వరద ప్రవాహం కొనసాగుతోంది.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

నంద్యాల(సిటీ): వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం కల్పించిన ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పెంచారు. మొదట గత నెల 25వ తేదీన గడువు ముగిసింది. రెండవ విడత కింద ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు అర్హులైన పేద పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి ఉచిత విద్యను అందించేందుకు రెండవ విడతలో దరఖాస్తులు కోరుతున్నామన్నారు.

మహాకుంభాభిషేక నిర్వహణకు ప్రత్యేక కమిటీలు



సమావేశంలో చర్చిస్తున్న చైర్మన్, ఈఓలు

మహానంది: మహానంది క్షేత్రంలో 20 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం విజయవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వర రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో మంగళవారం ట్రస్ట్ బోర్డు సభ్యులు, వేదపండితులు, అర్చకులు, సిబ్బందితో మరోసారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో ముందుగా గర్భాలయ కలశ ప్రతిష్ఠ, అనంతరం కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. వేదపండితులు రవిశంకర అవధాని కార్యక్రమానికి అధ్యక్షుడిగా, కన్వీనర్‌గా ఆలయ ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, సభ్యులుగా ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు, సిబ్బంది హరినాథ్, మల్లయ్య, ధర్మకర్తలు గంగిశెట్టి మల్లికార్జున, వీరభద్రుడులను నియమిస్తూ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

నంద్యాల(సిటీ): ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ఫీజు చెల్లింపు బుధవారంతో ముగుస్తుందని ఆర్ఐఓ గురువయ్యశెట్టి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌లకు తెలియజేశారు. మరోమారు పరీక్ష ఫీజు పొడిగింపునకు అవకాశం ఉండదన్నారు.

అడుగడుగునా అసమ్మతి!

తమ్ముళ్ల మధ్య విభేదాలతో పలుచబడ్డ లోకేశ్ పాదయాత్ర

- ఎమ్మిగనూరులో కనిపించని కేంద్ర మాజీ మంత్రి కోట్ల
- అదే బాటలో ఆయన వర్గం ఎమ్మిగనూరు టీడీపీ నేతలు
- డోన్ నుంచి కోడుమూరు దాకా అసమ్మతి సెగ
- చివరి నిమిషంలో అయిష్టంగా పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి
- అన్నింటికీ 'నాన్నతో మాట్లాడుదాం' అంటూ దాటవేత



గత నెల 25న కోసిగిలో ఇరువర్గాల ఘర్షణ

తమ్ముళ్ల విభేదాలతో అడుగడుగునా కొత్త చిక్కులు. ప్రతీ నియోజకవర్గంలో అసమ్మతి గళం.. కూలీ డబ్బులు చెల్లించి జనసమీకరణ చేస్తున్నా లభించని ఆదరణ. ప్రజల నిలదీతకు సమాధానం చెప్పలేక.. నాయకులకు సర్దిచెప్పలేక.. 'నాన్నతో మాట్లాడుదాం' అనే మాటతో అడుగు భారంగా కదులుతోంది. జిల్లాలో ఇదీ నారా లోకేష్ యువగళం పాదయాత్ర తీరు. ఆయనతో లాభం లేదనుకున్నారో, 'ఇదేం ఖర్మ' అనుకున్నారో కానీ.. కనీసం లోకేష్ మాటలను ఖాతరు చేయని పరిస్థితి. ఎవరికి వారు వర్గాలుగా విడిపోగా.. వెంట నడిచే దిక్కులేక యాత్ర చప్పబడింది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు

లోకేశ్ పాదయాత్ర గత నెల 13న నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో మొదలైంది. ఇప్పటి దాకా ఆరు నియోజకవర్గాల్లో యాత్ర పూర్తయి కోడుమూరు నియోజకవర్గానికి చేరింది. ప్రతిచోటా అసమ్మతి సెగ మధ్యనే యాత్ర సాగుతోంది. డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డికి టిక్కెట్ ఇవ్వొద్దని, అతనికిస్తే పనిచేసే ప్రసక్తే లేదని కేఈ ప్రభాకర్ వర్గీయులు భీష్మించారు. సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా యాత్రలో కరపత్రాలు కూడా పంపిణీ చేశారు. ఈ క్రమంలో కేఈ వర్గీయులు టీఈ కేశన్నగౌడ్, తొప్పల శ్రీనివాసులును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వీరు లోకేశ్‌ను కలిసి టీడీపీలో మొదటి నుంచి ఉన్న తమను సస్పెండ్ చేసి టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన సుబ్బారెడ్డికి అండగా పార్టీ నిలవడం ఏంటని ప్రశ్నించారు. దీనికి లోకేశ్ నుంచి సరైన సమాధానం రాకపోగా.. 'నాన్నతో మాట్లాడదాం' అని జారుకోవడం గమనార్హం. ఈ ఒక్క మాటతో అతనికి నాయకత్వ లక్షణాలే లేవనే భావన కేడర్‌లో వచ్చేసింది.

అడుగడుగునా అసమ్మతి పోరు

ఆలూరులో నాలుగు వర్గాల మధ్య యాత్ర కొనసాగింది. కోట్ల సుజాతమ్మకు వ్యతిరేకంగా వైకుంఠం మల్లిఖార్జున, శివప్రసాద్, వీరభద్రగౌడ్ ఎవరికి వారు యాత్రలో నడిచారు. చివరకు దేవనకొండ క్రాస్‌లో కోట్ల, శివప్రసాద్ వర్గాల మధ్య గొడవ కూడా జరిగింది. కుటుంబానికి ఒకే టిక్కెట్ ఇస్తామని ఇప్పటికే చంద్రబాబు స్పష్టం చేయడంతో సూర్యప్రకాశ్‌రెడ్డికి టిక్కెట్ వస్తే ఆలూరులో తమకు అవకాశం వస్తుందనే యోచనలో తక్కిన ముగ్గురు ఉన్నారు. దీంతోనే సుజాతమ్మకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు. మంత్రాలయంలో కూడా తిక్కారెడ్డికి వ్యతిరేకంగా వాల్మీకి నేతలు ముత్తురెడ్డి, ఉలిగయ్య పనిచేస్తున్నారు. ఆలూరు సుజాతమ్మకు ఇస్తే మంత్రాలయంలో బోయలకు, మంత్రాలయంలో రెడ్డికి ఇస్తే ఆలూరులో బోయలకు టిక్కెట్ యోచనలో టీడీపీ ఉంది. దీంతో తమకూ అవకాశం వస్తుందని ఈ ఇద్దరూ ఉన్నారు. మంత్రాలయంలో జరిగిన సభలో 'కొందరు పగలు టీడీపీలో.. రాత్రి మరో పార్టీలో ఉంటున్నారు' అని తిక్కారెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో టీడీపీ శ్రేణులను కించపరిచేలా వ్యాఖ్యలు ఉన్నాయని ఉలిగయ్య, ముత్తురెడ్డి వర్గాలు వాదనకు దిగాయి. ఈ క్రమంలో తిక్కారెడ్డి, వాల్మీకి నేతలు కర్రలతో దాడి చేసుకున్నారు.

కనిపించని కోట్ల

ఎమ్మిగనూరులో 5 రోజులు యాత్ర కొనసాగితే.. ఒక్క రోజు కూడా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కన్పించలేదు. కోట్ల వర్గీయులు కృష్ణారెడ్డి, రంగముని నాయుడు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్‌శెట్టి, ఆదెన్న, పార్థసారథిరెడ్డి, వీరారెడ్డితో పాటు ఎవ్వరూ యాత్రలో పాల్గొనలేదు. ఎమ్మిగనూరు అసెంబ్లీ టిక్కెట్ కోట్ల ఆశిస్తున్నారు. అక్కడ పార్టీ కార్యాలయం కూడా ప్రారంభించారు. అప్పటి నుంచి జయనాగేశ్వరరెడ్డి, కోట్ల వర్గాల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. కోట్ల ఎంపీ టిక్కెట్ ఆశిస్తే ఎమ్మిగనూరుకు హాజరవ్వాలి. గైర్హాజరయ్యారంటే ఆయన ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్నారని స్పష్టమవుతోంది. లోకేశ్ కూడా కోట్ల ఎందుకు గైర్హాజరయ్యారని ఆరాతీసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆలూరుకు మాత్రమే కోట్ల కుటుంబాన్ని పరిమితం చేస్తున్నట్లు పరోక్షంగా పార్టీ చెప్పినట్లయింది. అయితే కోడుమూరు కోట్లకు సొంత నియోజకవర్గం కావడం, ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో కోడుమూరు బాధ్యతలు సూర్యప్రకాశ్‌రెడ్డికి అప్పగించి, ఆయన చెప్పిన వారికే టిక్కెట్ ఇస్తామని కూడా చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో కోడుమూరు రోడ్ మ్యాప్ కూడా కోట్ల చెప్పినట్లే రూపొందించారు. దీనిపై విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తాను చెప్పినట్లు రోడ్‌మ్యాప్ లేకపోవడంతో యాత్రకు గైర్హాజరు కావాలని తొలుత విష్ణువర్ధన్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే టీడీపీ నేత అమర్‌నాథరెడ్డి.. విష్ణు ఇంటికి వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. మొదటి నుంచి కోడుమూరు బాధ్యతలు తానే చూస్తున్నానని, నియోజకవర్గంలో వారి కంటే తనకే బలమైన వర్గం ఉందని, అలాంటిది ఇప్పుడు కోట్లకు పెత్తనం ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించినట్లు చర్చ జరుగుతోంది. అమర్‌నాథరెడ్డితో పాటు ఇతర నేతలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో అయిష్టంగా మంగళవారం లోకేశ్‌కు స్వాగతం పలికారు. అయితే ఆ తర్వాత కోడుమూరులో నిర్వహించిన బహిరంగ సభ వేదికపై కోట్ల మాత్రమే కనిపించడం, విష్ణు తన ఇంటికే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా నేటి నుంచి యాత్రలో పాల్గొంటారా? లేదా? అనే విషయంలో కూడా స్పష్టత కొరవడింది.

నీళ్లు నమిలిన లోకేష్

గత నెల 19న ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి వచ్చిన లోకేష్‌ను మహిళలు నిలదీశారు. ఈసారి మాకు అధికారం ఇవ్వండని లోకేష్ కోరగా.. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మీరు ఏమి చేశారంటూ మహిళలు ప్రశ్నించడంతో ఊహించని పరిణామానికి నీళ్లు నమిలాడు. ఆలూరు నియోజక వర్గం నుంచి రెండు సార్లు వైసీపీ ఎమ్మెల్యేను గెలిపించారని మహిళలపై అసహనం వ్యక్తం చేయగా.. వాళ్లు కూడా అదేస్థాయిలో నిలదీయడంతో లోకేష్ అక్కడి నుంచి జారుకున్నాడు.

పలుచబడ్డ పాదయాత్ర

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు అసలే జనాలు లేకుండా సాగుతున్న యాత్రలో నేతల మధ్య విభేదాలతో మరింత పలుచబడింది. ఉదయం, సాయంత్రం వెయ్యి మంది చొప్పున జనాలను సేకరించేలా మొదట ప్రణాళికలు చేసుకున్నారు. ఒక్కొక్కరికి రూ.500 కూలి పార్టీ చెల్లించేలా నిర్ణయం తీసుకున్నట్లు కూడా తెలిసింది. రోజుకు రూ.10లక్షలు ఇస్తున్నా యాత్రలో 500మంది కూడా కన్పించడం లేదు. దీంతో చిన్నస్థలంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, అందులో కొంతమందిని ఉంచి సభ నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. ఎమ్మిగనూరు సభ ఘోరంగా ఫ్లాప్ అవడంతో జనసమీకరణ కూలి డబ్బులు కూడా నిలిపేసినట్లు సమాచారం.



వాల్మీకులకు అవమానం

గత నెల 25న మంత్రాలయం ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, వాల్మీకి నేతలు ఉలిగయ్య, ముత్తురెడ్డి, రామిరెడ్డి వర్గీయుల మధ్య కోసిగి మండల కేంద్రంలో బాహాబాహీ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో మరుసటి యాత్రలో పాల్గొనేందుకు వాల్మీకి నేతలు, అనుచరులు వాహనాల్లో సుంకేశ్వరి రోడ్డు వద్దకు చేరగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు.



గత నెల 30న ఎమ్మిగనూరులో జనం లేక ఫ్లెక్సీల మధ్య సభ నిర్వహణ

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయి..



బడి తెరిచేలోగా విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. పుస్తకాలు అందక చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో చకచకా ఏర్పాట్లు చేస్తోంది. వేసవి సెలవులు ముగిసేలోగా పాఠ్యపుస్తకాలను విడతల వారీగా ఆయా మండలాలకు చేర్చుతోంది. మొదటి విడతగా బనగానపల్లె మండలానికి 1 నుంచి 10వ తరగతి వరకు 33,143 పాఠ్యపుస్తకాలు మంజూరు కాగా మంగళవారం బస్సులో ఎమ్మార్సీ చేర్చినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా విద్యా కానుక కిట్లు పాఠశాలకు చేరుతాయన్నారు. – బనగానపల్లెరూరల్

రాగి జావ.. గ్లాసులు రాగా!



పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా జగనన్న గోరు ముద్దలో రాగిజావను చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాగి పిండి, బెల్లం సరఫరా చేసి కార్యక్రమాన్ని అమలు చేసింది. కాగా వచ్చే విద్యా సంవత్సరానికి ప్రతి విద్యార్థికి ఒక స్టీల్ గ్లాస్ పంపిణీ చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు ఆయా పాఠశాలలకు గ్లాసులను సరఫరా చేస్తోంది. మంగళవారం జూపాడుబంగ్లా మండలానికి 3,829 చేరాయి. బడి తెరిచేలోగా అందరికీ గ్లాసును అందజేస్తామని ఎంఈఓ మోహన్ తెలిపారు. – జూపాడుబంగ్లా

విద్యా కానుక.. అంతా సిద్ధం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముందుగానే స్కూల్ యూనిఫాం వచ్చేసింది. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే వాటిని పంపిణీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మండల కేంద్రాలకు విద్యాకానుక కిట్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, బ్యాగ్ తదితర సామగ్రి చేరాయి. తాజాగా యూనిఫాంలు కూడా వచ్చేశాయి. మద్దికెర మండలంలో 3,670 మంది విద్యార్థులుండగా ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున ప్రభుత్వం పంపినట్లు ఎంఈఓ రంగస్వామి తెలిపారు. – మద్దికెర



చెంచు గూడేల్లో సౌకర్యాలు కల్పించండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలోని 42 చెంచు గూడేలకు నియమించిన దత్తత అధికారులు ఆయా గూడేల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో చెంచు గూడేల్లో కనీస వసతి సదుపాయాల కల్పనపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెంచు గూడేల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు వంటి మౌలిక వసతులు అధికారులు కల్పించాలన్నారు. చిన్న కొట్టాల చెరువు, బైర్లూటీ, నారపురెడ్డి కుంట, మాడుగుల, గాజులపల్లి మెట్ట తదితర 9 చెంచు గూడెల్లో తాగునీటికి సంబంధించి బోర్ల మరమ్మతులు, డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులు, ఆర్ఓ ప్లాంట్, సోలార్ కనెక్షన్, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు తదితర పనులకు ఎంపీ ల్యాడ్స్ కింద రూ.40 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కింద చెంచుగూడెల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వెలుగోడు చెంచు కాలనీలో ఐటీడీఏ కార్పొరేషన్ నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెంచు గూడెంలలో మంజూరైన 2,170 గృహాలలో నిర్మాణాలకు అనువుగా ఉన్న 651 ఇళ్లను వారం రోజుల్లో గ్రౌండింగ్ చేయాలన్నారు. 16 గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రూ.9.8 లక్షల ఆరు బెడ్ల షెడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎదురుపాడు, 80 బన్నూరు గ్రామాల్లో 24 వ్యవసాయ బోర్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డికి సూచించారు. జానాల గూడెం, మాడుగుల, ఎర్రమటం గూడెంలలో సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు వారం రోజుల్లో నివేదిక సమర్పించాలన్నారు. చెంచు గూడేల్లో గుర్తించిన 88 రేషన్ కార్డులకు గాను కేవలం 4 కార్డులు మాత్రమే పూర్తి కావడంపై సివిల్ సప్లయ్ అధికారిపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆధార్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డు, పెన్షన్ల జారీకి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీడీ మురళీ తదితర అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తొట్టి తిరుమంజనం



కాళింగనర్దనోత్సవంలో కొలువైన స్వామి, అమ్మవారు

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిలంలో లక్ష్మీనరసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తొట్టి తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు తిరుమంజనం వస్త్రాలతో ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పన్నీరుతో నింపిన వెండితొట్టిలో సప్త నదులను ఆవాహం చేస్తూ ఉత్సవమూర్తుల పాదాలను ముంచి అభిషేకించారు. అలాగే కాళింగనర్దనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో మంత్రి గుమ్మనూరు, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ సృజన, జేసీ మౌర్య తదితరులు

తాగునీటి పథకాలపై ప్రత్యేకదృష్టి

- నీటి పథకాలు పనిచేసేలా చర్యలు తీసుకోండి
- గాజులదిన్నె నీటి నిల్వ సామర్థ్యం పెంచుతాం
- ఎగువ భద్ర ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ ఫైల్
- డీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- రూ. 1400 కోట్లతో ఎల్లెల్సీ లైనింగ్
- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- సమావేశానికి హాజరైన జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు

- వివరాలు 8లో

హైస్కూళ్లకు నైట్‌వాచ్‌మెన్లు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల భద్రతకు విద్యాశాఖ నైట్ వాచ్‌మెన్లను ఏర్పాటు చేసింది. జిల్లాలో 247 హైస్కూళ్లకు నైట్‌వాచ్‌మెన్లను నియమించారు. వీరు హైస్కూళ్ల దగ్గర రాత్రి వేళ విధులు నిర్వహించడం, మన బడి నాడు–నేడు కింద చేపట్టిన పనులు, స్కూళ్లలో కల్పించిన సౌకర్యాలను ఎవరు నష్టపరచకుండా కాపాల కాయాల్సి ఉంటుంది. నియామకాల్లో స్కూళ్లలో పని చేస్తున్న ఆయా/కుక్ కమ్ హెల్పర్ల భర్తలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వగా, గ్రామ/వార్డులోని మాజీ సైనికులు రెండో ప్రాధాన్యత ఇచ్చారు. వీరెవరు కూడా అందుబాటులో లేని చోట్ల ఇతరులను నియమించారు. ఎంపికైన వారికి నెలకు రూ.6 వేల చొప్పున టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించనున్నారు.

తాగు నీటి పథకాలపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌సీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

కర్నూలు కల్చరల్: జిల్లాలో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన అధ్యక్షతన గ్రామీణ ఉపాధి హామీ పథకం, తాగునీరు, గృహ నిర్మాణాలు, వ్యవసాయం, ఇరిగేషన్ అంశాలపై నిర్వహించిన జిల్లా రివ్యూ కమిటీ సమావేశంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

- మంత్రి బుగ్గన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు, ఇతర నీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. ఈ నాలుగేళ్లు వర్షాలు బాగా పడటం, దానికితోడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో తాగు నీటి సమస్య చాలా వరకు తగ్గిందన్నారు. 1995లో పామిడి నుంచి ప్రారంభించిన వాటర్ స్కీమ్ 2004లో అతి కష్టం మీద పూర్తి అయిందని 2019నాటికి ఎండి పోయిందన్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం పాత బిల్లులు చెల్లించడంతో పాటు అదనంగా మూడు కోట్ల రూపాయలు వెచ్చించి ప్రస్తుతం డోన్ నియోజకవర్గంలో 16 గ్రామాలకు నీరు అందించడం జరుగుతోందన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ ఫైల్ చేసిందని లిస్ట్ కూడా అయిందన్నారు. వర్షపు నీటి ఆధారంగా ఉన్న గాజుల దిన్నె ప్రాజెక్టుకు ప్రభుత్వం వచ్చిన తర్వాత స్లూయిస్ ఏర్పాటు చేసి హంద్రీనీవా నుంచి నీటిని తీసుకున్నామని, ఇది 40 సంవత్సరాలుగా ఉన్న డిమాండ్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం కూడా ఒక టీఎంసీ అదనంగా పెంచుతామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ నిర్వహణకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని, నిధుల కేటాయింపునకు తగిన చర్యలు తీసుకుంటామని సంబంధింత ఇంజినీర్‌ను ఆదేశించారు.



డీఆర్‌సీ సమావేశానికి హాజరైన జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

- మంత్రి గుమ్మనూరు మాట్లాడుతూ ఎల్ఎల్‌సీకి సంబంధించి జీరో నుంచి 250 కిలోమీటర్ల వరకు తమ ప్రభుత్వం రూ.1400 కోట్లు ఖర్చు చేసి లైనింగ్ పనులు చేయడంతో కోడుమూరు వరకు పంట పొలాలు సస్య శ్యామలంగా ఉన్నాయన్నారు.

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ శాశ్వత సాగునీటి పరిష్కారంగా హెచ్ఎన్ఎస్ఎస్ తీసుకొని వచ్చారని, అందువల్లే పశ్చిమ ప్రాంతంలో 68 చెరువులకు నీరు ఇచ్చే అవకాశం కలిగిందన్నారు.

ఎవరెవరు ఏం మాట్లాడారంటే..

జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ కర్నూలు జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో మెరుగైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రగతిపథంలో నడిచేందుకు ఈ వేదిక ఉపయోగపడాలన్నారు.

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి గృహాలు కేటాయించిన లబ్ధిదారులకు రుద్రవరం లేఅవుట్ దూరం అవుతుందన్నారు. వారికి తడకనపల్లె, లక్ష్మీపురం లే అవుట్లను కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మల్లికార్జున రిజర్వాయర్ పనులు చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.
- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ చిల్లబండ గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలోని తిమ్మాపురం, రాళ్లదొడ్డి గ్రామాల్లో నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎల్ఎల్‌సీ కెనాల్ గేట్లు మరమ్మతులు చేయించాలన్నారు.
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ తుగ్గలి మండలంలో 10 గ్రామాలకు సంబంధించి ట్రాన్స్‌పోర్టేషన్ బిల్స్ పెండింగ్‌లో ఉన్నాయని వాటిని చెల్లించాలని కోరారు. వెల్దుర్తి మండలంలో గతంలో 15 రోజులకు ఒకసారి నీరు వచ్చేదని హంద్రీ నీవా నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. మద్దికెర మండలంలో అగ్రహారం, తుగ్గలి మండలంలో జొన్నగిరి, వెల్దుర్తి మండలంలో గోవర్ధన గిరి గ్రామాల్లో ఇళ్ల పట్టాల పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో జగన్నాథ గట్టులో ఇచ్చిన ఇళ్లు ఎందుకు అగిపోయాయో తెలియని పరిస్థితి ఉందని, అలాగే కర్నూలు కార్పొరేషన్‌లో ఇంకా చాలా మంది ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారని వారికి న్యాయం చేయాలన్నారు. ఓల్డ్‌సిటీలో విద్యుత్ తీగలు వేలాడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- ఎమ్మెల్సీ టీటీ నాయుడు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నీరు, మజ్జిగతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలని కోరారు.
- డీఆర్‌సీ సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న గ్రేడ్-1 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

కర్నూలు(రాజ్‌విహార్): మహిళ, శిశు సంక్షేమ, సాధికార శాఖలో ఖాళీగా ఉన్న ఆరు ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్/ గ్రేడ్-1 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీపీఎస్సీ ద్వారా గతంలో నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు గత నెలలో విడుదలయ్యాయి. మెరిట్ సాధించిన వారిలో కర్నూలు జోన్ (కర్నూలు, వైఎస్ఆర్ కడప, అనంతరపురం, చిత్తూరు ఉమ్మడి జిల్లాలు)కు ఆరుగురిని కేటాయించారు. దీంతో వీరికి ఈ నెల 6న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతాల పెంపు

కర్నూలు(హాస్పిటల్): జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు జీతాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్‌ఎంలో కన్సాలిడేటెడ్ పే, రెమ్యునరేషన్, హానరోరియం, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేస్తున్న వారందరికీ పెరిగిన జీతాలు వర్తించనున్నాయి. ఇటీవల ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయీస్ అసోసియేషన్ జీతాలు పెంచాలని విన్నవించగా ప్రభుత్వం అంగీకరించింది. మొత్తం 172 కేడర్లలో ఒక్కో ఉద్యోగికి దాదాపుగా 23 శాతం దాకా జీతాలు పెరిగే అవకాశం ఉంది. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతాలు పెరగడంపై ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, ఉమెన్స్ వింగ్ జాయింట్ సెక్రటరీ అరుణ, ఏపీజీఏ నాయకులు సంపత్, ఎన్‌హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు జి. రామనాథశర్మ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	4,030	7,090
ఆముదం	4,329	5,289
ఉల్లిగడ్డ	555	555
ఎండుమిర్చి	4,599	19,511
మొక్కజొన్న	1,116	1,771
కందులు	7,509	8,032
వాము	5,027	23,299
పొద్దుతిరుగుడు	4,129	4,349
శనగలు	4,169	4,660
మినుములు	6,509	7,455

అత్యధిక ఓఆర్ సాధించిన ఆత్మకూరు డిపో

ఆత్మకూరు: జిల్లాలోని ఆత్మకూరు ఆర్టీసీ డిపో మే 1వ తేదీన అత్యధిక ఓఆర్ సాధించినట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ డిపో మే 1న 101 ఓఆర్ సాధించి జిల్లాలోని డిపోల కంటే ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టిందన్నారు.రూ.13,04,272 లు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఇందుకు కృషి చేసిన డిపో ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

టీడీపీని వీడిన 150 కుటుంబాలు

- మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక

డోన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై దొరపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి స్వగృహంలో దొరపల్లె గ్రామానికి చెందిన 150 టీడీపీకి చెందిన కుటుంబాల సభ్యులు మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు దొరపల్లె చిరంజీవి నాయకత్వంలో టీడీపీ నాయకులు బోగిని కిష్టయ్య, రంగడు, గోపాల్, శంకర్, బాలు బన్ని, దేవేంద్ర, ఈడిగ గోపాల్, జంగాల సురేష్, యల్లయ్య, సుధాకర్, రంగస్వామి, నగేష్, వెంకటేష్, ఎరుకల సుధాకర్, మౌలాలి, చాంద్ బాష, ఖాజా, రాజయ్య, రసూల్, కిరణ్, కంసలి నాగరాజు, పాశం వెంకటేశ్వర్లు, యాదగిరి, హరిశ్చంద్రుడు, చాకలి నాగరాజు, కున్నూరు యర్రన్న, చరణ్ కుమార్, గ్రంథాల యల్లయ్యతో పాటు మరో 120 కుటుంబాల సభ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న దొరపల్లె వాసులు

కృష్ణాపురం దేవరలో అపశృతి

- ఆలయంలో పూజలు చేస్తుండగా తేనెటీగలు దాడి
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు
- మరో ఆరుగురికి స్వల్పగాయాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో మంగళవారం జరిగిన దేవరలో అపశృతి చోటుచేసుకుంది. మారెమ్మ గుడి వద్ద పూజలు చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో గ్రామ పెద్ద, వైఎస్సార్సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి, కుటుంబసభ్యులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... దేవరలో భాగంగా గోపాల్‌రెడ్డి ఇంటి నుంచి దేవర స్వామి బయలుదేరాడు. గ్రామ నలుదిక్కులా ఉన్న ఆలయాల్లో పూజల్లో భాగంగా మూలమీది కనుమ వద్ద గల మారెమ్మ గుడి వద్దకు గ్రామస్తులు చేరుకున్నారు. గోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆలయం లోపల పూజలు చేస్తుండగా సమీప చెట్టుపై గల పెద్ద తేనెటీగల తుట్ట నుంచి ఒక్కసారిగా తేనెటీగలు లేచి దాడి చేశాయి. ఈ ఘటనలో గోపాల్ రెడ్డి, భార్య రాములమ్మ, కుమారులు చెన్నారెడ్డి, శ్రీకాంత్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఆలయం బయట ఉన్న గ్రామస్తుల్లో వెంకటేశ్, సోమన్న, వెంకట్, రాజు, సర్వోత్తమరెడ్డి, నాగేశ్వరరెడ్డిలకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను సీఐ యుగంధర్ తన వాహనంలో గ్రామానికి చేర్చారు. తీవ్రగాయాలైన గోపాల్‌రెడ్డి కుటుంబీకులను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.



ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణాపురం గోపాల్‌రెడ్డి

ఆ చిన్నారిని తల్లికే అప్పగించండి

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న చిన్నారిని తల్లి గాయత్రికి అప్పగించాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రేమ పేరుతో మోసపోయానని, తన బిడ్డను తనకు అప్పగించాలని హాలహర్వికి చెందిన సచివాలయ ఉద్యోగిని గాయత్రి చేసుకున్న విన్నపాన్ని కోర్టు పరిగణలోకి తీసుకుంది. చిన్నారి వయస్సు 18 నెలలే అని, ఆ చిన్నారిని దత్తత ఇవ్వడం సరైంది కాదని కోర్టు పేర్కొంది. కర్నూలు శిశుగృహలో ఉన్న తన బిడ్డను తనకే అప్పగించాలని గత కొద్ది నెలలుగా ఉద్యోగిని గాయత్రి న్యాయపోరాటం చేసింది. ఆమెకు జరిగిన అన్యాయంపై పూర్తి వివరాలతో గత మార్చి 29వ తేదీన 'మోసం పేరు రాకేష్.. పాప పేరు 18 నెలలు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. చివరకు హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ చిన్నారిని తల్లి గాయత్రికే అప్పగిస్తామని ఐసీడీఎస్ పీడీ ఉమా మహేశ్వరి తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారి చైల్డ్ వెల్ఫేర్ సెంట్రల్ కమిటీ పర్యవేక్షణలో ఉంది. కోర్టు తీర్పుతో బిడ్డ విషయంలో తనకు న్యాయం జరిగిందని గాయత్రి పేర్కొన్నారు.

కాపురానికి రాలేదని భార్యపై హత్యాయత్నం

- జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

బొమ్మలసత్రం: వేధింపులు తాళలేక తనకు దూరంగా ఉన్న భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన భాస్కర్, రాములమ్మ దంపతుల కుమార్తె లక్ష్మిని అవుకు మండలం కొండమనాయునిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లుతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వెంకటేశ్వర్లు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అంతేకాకుండా తరచూ భార్య లక్ష్మిని వేధిస్తుండటంతో నాలుగేళ్ల క్రితం ఆమె పిల్లలను తీసుకుని వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు చెల్లెలి భర్త మృతి చెందటంతో అంత్యక్రియలకు మంగళవారం కొండమనాయునిపల్లెకు చేరుకుంది. అక్కడ వెంకటేశ్వర్లుతో పాటు అతని బంధువులు ఆమెతో ఘర్షణ పడి రాళ్లతో దాడి చేశారు. అనంతరం తాడుతో గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించారు. వారి నుంచి తప్పించుకున్న ఆమె నేరుగా జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేసింది. గాయాలతో ఉన్న లక్ష్మిని చికిత్స కోసం పోలీసులు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

నిలిచిన ఆర్‌టీసీ బస్సును ఢీకొని..

- తీవ్రంగా గాయపడి గౌండ మృతి

మిడుతూరు: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ నిలిచిన ఆర్‌టీసీ బస్సును వెనుక వైపు ఢీకొట్టిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్ఐ మారుతిశంకర్ తెలిపిన వివరాల మేరకు.. బైరాపురం గ్రామానికి చెందిన మహబూబ్ బాషా (35) గౌండ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రహమద్‌బీతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. మిడుతూరు నుంచి సరుకులు తీసుకొని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అదే మార్గంలో నందికొట్కూరు నుంచి నంద్యాలకు వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు సుంకేసుల బాట వద్ద నిలుపగా ప్రయాణికులు దిగుతున్నారు. అదే సమయంలో మాబాషా ఆర్‌టీసీ బస్సును వెనుక నుంచి ఢీ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన బొంతల మహబూబ్‌బాషా

కిడ్నాప్ కేసు సుఖాంతం



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఆర్‌పీ చౌడేశ్వరి

- బాలుడిని అపహరించిన దుండగుల అరెస్టు
- సురక్షితంగా తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత
- కేసు వివరాలు వెల్లడించిన గుంతకల్లు ఎస్ఆర్‌పీ చౌడేశ్వరి

మంత్రాలయం: ఎట్టకేలకు బాలుడి కిడ్నాప్ కేసును రైల్వే పోలీసులు ఛేదించారు. చాకచక్యంగా నిందితులను అరెస్టు చేసి బాలుడిని స్వాధీన పరుచుకున్నారు. బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రుల ఒడికి చేర్చారు. గుంతకల్లు సూపరింటెండెంట్ రైల్వే పోలీస్ చౌడేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం కేసు వివరాలు వెల్లడించారు.

కుదుర్చుకున్న ఒప్పందం

అనంతపురం గుంతకల్లు నివాసి గుద్దం వలిబాషా పదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. సంతానం లేకపోవడంతో పిల్లల కోసం ప్రయత్నం మొదలుపెట్టాడు. వలిబాషా తన అక్క తహిరబేగంను రాయచూరు జిల్లా కేంద్రానికి మనువు ఇచ్చారు. అక్కడికి వస్తున్న తరుణంలో రాయచూరు జిల్లా ఆకుల బిచ్చాలికు చెందిన మదరసా వార్డెన్ షేక్ మహ్మద్ మహబూబ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు పిల్లలు కాలేదని పేర్కొనగా అనాథ ఆశ్రమంలో లేదా వేరొక చోట పిల్లాడిని చూస్తానని మహబూబ్ చెప్పారు. ఇందుకు ఇరువురు రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే కోవలో మదరసాలో చదువుకుని రాయచూరులోని చందర్బందర్ విజ్ఞాన్ హైస్కూలు పక్కన నివసించే మహ్మద్ మౌలా కుమారుడు మహ్మద్ ఆఫ్జల్ ఖాన్‌తో జతకట్టారు. ఒప్పందం ప్రకారం వలిబాషా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో 17వ తేదీన రూ.60 వేలు, 18న రూ.60 వేలు, 21వ తేదీన రూ.40 వేలు మహబూబ్‌కు అకౌంట్‌కు ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు.

బయట పడిందిలా..

మంత్రాలయం మండలం రాంపురం గ్రామానికి మహ్మద్ ముజమిల్‌కు మదరసాలో రాయచూరుకు చెందిన ఆఫ్జల్‌ఖాన్‌తో పరిచయం ఉంది. ఈ చనువుతో శుక్రవారం రాత్రి ఆఫ్జల్ ఖాన్ రాంపురం వచ్చి ఊరెళ్లాలి అని బైకు అడగడంతో ముజమిల్ ఇచ్చాడు. ప్లాన్ ప్రకారం మహబూబ్, ఆఫ్జల్ ఖాన్ పాత రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న వద్దె ఆంజనేయులు, అంకమ్మ కుమారుడు రాము (7 నెలలు)ను అపహరించారు. తుంగభద్ర రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్నట్లు నటిస్తూ శనివారం వేకువజామున 4.30 గంటలకు బైకుపై చిన్నారిని ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం బైక్‌ను ముజమిల్‌కు అప్పజెప్పేందుకు రాంపురం వెళ్లారు. ఈ బైక్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో గుంతకల్లులోని కసాపురం రోడ్డు డిగ్రీకళాశాల సమీపంలో నిందితులు బాలుడిని వలిబాషాకు అప్పగిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మహ్మద్ మహబూబ్, ఆఫ్జల్‌ఖాన్, వలిబాషాను అరెస్టు చేసి బైకు, బాలుడిని స్వాధీన పరుచుకున్నారు. శనివారం ఆదోని రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని ఎస్ఆర్‌పీ చౌడేశ్వరి ఉత్తర్వుల మేరకు దర్యాప్తు మొదలు పెట్టారు. డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో గుంతకల్లు రైల్వే సీఐ నాగేష్‌బాబు విచారణ చేపట్టారు. కేసును ఛేదించిన ఆదోని ఆర్‌పీ ఎస్ఐ రామస్వామి, గుంతకల్లు ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, శివరామ్, సాయి, కానిస్టేబుళ్లు హుస్సేన్, గాదిలింగ, గోపాల్‌ను ఎస్ఆర్‌పీ చౌడేశ్వరి అభినందించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న రైల్వే పోలీస్ బృందం

యువకుడి ఆత్మహత్య

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో మంగళవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన మీసాల పవన్‌కుమార్ (26) గౌండ పని చేస్తున్నాడు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చెడు వ్యసనాలకు లోనయ్యాడు. మనస్తాపంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత గమనించిన భార్య పద్మలత కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కొన ఊపిరితో పవన్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సిద్ధు తెలిపారు.



మృతుడు మీసాల పవన్‌కుమార్ (ఫైల్)

తల్లిదండ్రులు మందలించారని..

శ్రీశైలంప్రాజెక్ట్: చెడు వ్యసనాలను వీడాలని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సున్నిపెంట వెస్టన్ కాలనీకి చెందిన సన్నెపోగు ధనుష్(18) చదువు మానేసి హోటళ్లలో పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై సోమవారం బైక్‌ను యాక్సిడెంట్ చేశాడు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.